


అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు

## పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా 'డబుల్' ఇండ్లు

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఇండ్ల పట్టాల పంపిణీ**

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 2 : పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో 180 డబుల్ బెడ్ రూం ఇండ్ల పట్టాలను ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. 2014 తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గమనించి నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉండాలని కోరారు. మంచి రోజులు చూసుకుని లబ్ధిదారులంతా గృహ ప్రవేశాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ డీసీనాయక్, రెవెన్యూ అడిషనల్ కమిషనర్ స్నేహషబరీస్, తహసీల్దార్ రవీందర్‌దత్తు, సీఐ మన్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ అశ్వినీకుమారి, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, వార్డు సభ్యుడు మొగుళ్ల జీవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు జక్క రాంరెడ్డి, కొత్త కిషన్‌గౌడ్, పూజారి చక్రవర్తిగౌడ్, తోర్పునూరి ధనంజయ్యగౌడ్, జెర్కోని రాజు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, ప్రకాశ్‌గౌడ్

# సొంతింటి కానుక.. ఆనందాల వేడుక

**రంగారెడ్డి జిల్లాలో పండుగలా సాగిన డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ**

**మహేశ్వరం నియోజకవర్గంలోని మన్‌సాన్‌పల్లిలో 2,099 మంది లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసిన విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి**

రంగారెడ్డి, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ) : సకల సౌకర్యాలతో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నదని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మన్‌సాన్‌పల్లిలో మహేశ్వరం, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించిన 2,099 ఇండ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం దేశానికే ఆదర్శమన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలి, ఆత్మగౌరవంతో గొప్పగా జీవించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ 'డబుల్' ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి సౌకర్యాలతో డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి పేదలకు అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్ఐసీ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహిస్తున్నట్లు వివరించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఎవరూ పైసలు ఇవ్వొద్దని, పైరవీలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వికారాబాద్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, ప్రకాశ్‌గౌడ్, ఆర్డీవో సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం..**

ఒక్క రూపాయి భారం లేకుండా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అందజేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. నిన్నమొన్నటి వరకు అద్దె ఇంట్లో.. నేడు డబుల్ బెడ్ రూమ్.. పొట్ట చేతబట్టుకుని పట్నం వచ్చి కిరాయి కట్టలేక అష్ట కష్టాలు పడుతున్న పేదలకు తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్రూం పథకం రూపంలో సొంతింటి కలను సాకారం చేయడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సోమవారం మన్‌సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను అందుకున్న సందర్భంగా మంత్రి సబితారెడ్డితో లబ్ధిదారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. దశల వారీగా ఆయా కుటుంబాలు వారం, పది రోజుల్లో గృహ ప్రవేశాలు చేసి పాలు పొంగించుకోనున్నాయి. కలలో కూడా ఊహించని రీతిలో ఇండ్లను కట్టించి ఇచ్చిన సీఎం కేసీఆర్ పది కాలాల పాటు సల్లంగా ఉండాలని లబ్ధిదారుల కుటుంబాలు ఈ సందర్భంగా దీవెనలను అందజేశాయి. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా బస్సుల్లో తీసుకొచ్చి భోజనం పెట్టి మరీ ఇండ్ల పత్రాలను అందజేయడం ద్వారా మరోసారి తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలపై ఉన్న మమకారాన్ని చాటుకున్నది.

# 'డబుల్' ఇండ్లు పేదలకు వరం

**శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్లలో ఇండ్ల పట్టాలను పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**

కొండాపూర్, అక్టోబర్ 2 : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం పేదలకు వరమని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా పేదలకు ఇండ్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జనాభా ఎక్కువ ఉన్నదని, మరిన్ని ఇండ్లు మంజూరయ్యేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మళ్లీ వచ్చేది టీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలు తప్పకుండా ఆదరిస్తారన్నారు. ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే 2819 డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించగా, వీరిలో దివ్యాంగులు 70 మంది, ఎస్సీలు 479 మంది, ఎస్టీలు 169 మంది, జనరల్ కేటగిరీలో 2101 మంది ఎంపికయ్యారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావుతో కలిసి బటన్ నొక్కి లబ్ధిదారులకు నల్లగండ్ల, హఫీజ్‌పేట్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్లలోని ఇండ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, పూజిత గౌడ్, మంజులారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, రోజాదేవి, శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, జడ్సీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

# పేదల అభ్యున్నతే లక్ష్యం

- నార్సింగి, బైరాగిగూడలలో 356 మందికి 'డబుల్' ఇండ్ల పత్రాల పంపిణీ
- పైసా ఖర్చులేకుండా పేదలకు ఇండ్లు : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే : ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి
- కేసీఆర్ ఓ విజన్ ఉన్న నాయకుడు : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మణికొండ, అక్టోబర్ 2 : పేదల అభ్యున్నతే సీఎం కేసీఆర్ ప్రధాన లక్ష్యమని, పైసా ఖర్చు లేకుండా ఇండ్లను నిర్మించి ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌ది అని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని నార్సింగి, బైరాగిగూడలోని 356 మందికి మూడో విడుత డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను సోమవారం ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో లక్ష గృహాలను పదివేల కోట్లతో నిర్మించి అర్హులకు అందిస్తున్నామన్నారు.

**పేదల సొంతింటి కల సాకారం : ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి**

పేదల సొంతింటి కల సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. కేవలం తొమ్మిదేండ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా రూ.25వేల కోట్ల సంపాదనను సృష్టించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు.

**సీఎం కేసీఆర్ ఓ విజన్ ఉన్న నేత : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

సీఎం కేసీఆర్ ఓ విజన్ ఉన్న నాయకుడు కాబట్టే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రత్యేకతను చాటుకుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కులమతాలకు అతీతంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులకు అందిస్తున్నామన్నారు. ఇక్కడ స్థిరపడిన ఇతర రాష్ట్రాల ప్రజలకు సైతం 'డబుల్' ఇండ్ల పట్టాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖా యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, రాజేంద్రనగర్ ఆర్డీవో మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీఈ నర్సింహరాజు పాల్గొన్నారు.




శంకర్‌పల్లిలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

# సంక్షేమంలో నంబర్ వన్..

**రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**

- ప్రతి వ్యక్తికీ, కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందించాం
- ఇచ్చిన హామీలు నెరవేర్చినం.. మరోమారు కేసీఆర్‌ను ఆశీర్వదించండి
- శంకర్‌పల్లిలో రూ.131 కోట్ల నిధులతో 14 బ్లాకుల్లో 9.03 ఎకరాల్లో 1512 ఇండ్ల నిర్మాణం
- శంకర్‌పల్లిలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసిన మంత్రి మహేందర్‌రెడ్డి

షాబాద్/శంకర్‌పల్లి, అక్టోబర్ 2 : సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి మండలంలో 1512 మంది ఇండ్లు లేని పేదలకు మూడో విడుత డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ, కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం ఫలాలు అందాయన్నారు. శంకర్‌పల్లిలో రూ.131 కోట్లతో 14 బ్లాకుల్లో 9.03 ఎకరాల్లో 1512 ఇండ్ల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జీహెచ్ఎంసీ పరిధిలోని నిరుపేదలకు రూ.10వేల కోట్లతో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సీఎం కేసీఆర్ నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. తొలి విడుతలో 11,700 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందివ్వగా, రెండో విడుతలో 13,200 ఇండ్లను, నేడు మూడో విడుతలో 19,020 ఇండ్ల పంపిణీతో ఇప్పటి వరకు 34,920 ఇండ్లను పంపిణీ చేసినట్లు వివరించారు.

ఈ నెల 5న నాలుగో విడుత 17,864 మందికి ఇండ్లను పంపిణీ చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిసర, రంగారెడ్డిజిల్లా పరిధిలో 23,260 ఇండ్లను నిర్మించి ఇస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 9,872, మహేశ్వరంలో 9,892, రాజేంద్రనగర్‌లో 696, ఎల్బీనగర్‌లో 944, చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లిలో 1512, శేరిలింగంపల్లిలో 344 ఇండ్లను నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు.

## భావి తరాలకు తెలిసొచ్చేలా అభివృద్ధి : ఎమ్మెల్యే కాలె యాదయ్య

భవిష్యత్తులో భావి తరాలకు తెలిసొచ్చేలా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో స్థానికులకు 50 శాతం ఇవ్వాలని కోరానని, 10 శాతం ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులకు ఇండ్లను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రాకముందు ఏ విధంగా ఉందో, స్వరాష్ట్రం వచ్చాక ఎలా అభివృద్ధి జరిగిందో ప్రజలు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్న ఘనత రాష్ట్ర సర్కార్‌దేనన్నారు. 70 ఏండ్ల కాలంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ తదితర పార్టీలు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కుర్మ వెంకటేశ్, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, సహకార సంఘం చైర్మన్ శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బంగారు ప్రకాశ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌కన్నా, యూత్ అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బొల్లారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

